క్లుప్తంగా

విద్యార్థినికి ట్రిపుల్ ఐటీలో ప్రవేశం

సన్మానించిన పాఠశాల యాజమాన్యం



చినలింగాయపాలెం(కాకుమాను): పది పరీక్షల్లో ప్రతిభ కనబరచి నూజివీడు ప్రభుత్వ ట్రిపుల్ ఐటీ కళాశాలలో సీటు సాధించడం అభినందనీయమని ఎంఈఓ కె.ఎఫ్.కెనడీ అన్నారు. మండలంలోని చినలింగాయపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గతేడాది పది పరీక్షల్లో ప్రతిభ కనబరచి నూజివీడు ట్రిపుల్ ఐటీ కళాశాలలో సీటు సాధించిన షేక్ గౌసియాతో పాటు ఆమె తండ్రిని సోమవారం పాఠశాల ఆధ్వర్యంలో సన్మానించారు. ఈ సందర్భంగా కెనడీ మాట్లాడుతూ నేడు ప్రభుత్వ పాఠశాలల్లో విద్యనభ్యసించిన ఎంతో మంది విద్యార్థులు ట్రిపుల్ ఐటీలో సీట్లు సాధిస్తున్నారని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో నేడు అన్ని వసతులతో పాటు అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులచే నాణ్యమైన గుణాత్మక విద్యను అందిస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో ఎంఈఓ -2 విజయ్ భాస్కర్, హెచ్ఎం శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

గుంటూరు రూరల్: నల్లపాడు రైల్వేస్టేషన్ నుంచి వెంగాళయపాలెం రైల్వే అండర్ పాస్కు మధ్య గల ప్రదేశంలో రైల్వే ట్రాక్ వద్ద గుర్తు తెలియని మృత దేహాన్ని నల్లపాడు పోలీసులు సోమవారం గుర్తించారు. సీఐ వంశీధర్ తెలిపిన వివరాల ప్రకారం సుమారు 40 సంవత్సరాలు వయసు గల వ్యక్తి మొహం గుర్తు పట్టలేని విధంగా ఉందన్నారు. మృతదేహం ఛిద్రంగా ఉందన్నారు. మృతుడు బిస్కెట్ కలర్ ప్యాంట్, బ్లూకలర్ షర్ట్ ధరించి ఉన్నాడన్నారు. స్థానికుల సమాచారం మేరకు సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహానికి జీజీహెచ్ మార్చురీకి తరలించామన్నారు. వివరాలు తెలిసిన వారు నేరుగా నల్లపాడు పోలీసు స్టేషన్లో సంప్రదించాలని తెలిపారు.

ఆంధ్రులు గర్వించదగ్గ ఇంజినీర్ డాక్టర్ కేఎల్ రావు



లక్ష్మీపురం: ఒక ఆచార్యుడిగా, ఇంజినీర్గా, కేంద్ర మంత్రిగా పని చేసిన ప్రతిభాశాలి కె.ఎల్ రావు జీవితం అత్యంత విశిష్టమైందని సీనియర్ ఇంజినీర్ ఎన్.సదాశివం అన్నారు. స్థానిక అరండల్ పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో సోమవారం ఇంజినీర్ డాక్టర్ కె.ఎల్ రావ్ జయంతి నిర్వహించారు. ఆయన చిత్ర పటానికి పూల మాలలు వేసి, నివాళులర్పించారు. ఫాదర్ ఆఫ్ ఇండియన్ వాటర్ మేనేజ్మెంట్గా నాగార్జున సాగర్ ప్రాజెక్టు రూపకర్తగా భారత దేశానికి గణనీయమైన సేవలందించారన్నారు. సంస్థ కార్యదర్శి కొండాశివరామిరెడ్డి, విశ్రాంత ఇంజనీర్ పి.ఘన శ్యామాచార్యులు మాట్లాడుతూ దేశంలోనే అత్యుత్తమైనవిగా పేర్కొన్న నాగార్జున సాగర్ డ్యాం, విజయవాడ థర్మల్ పవర్ స్టేషన్ కె.ఎల్ రావ్ మేధో సంపత్తికి నిదర్శనమన్నారు. అనంతరం పలువురు సంస్థ సభ్యులు ప్రసంగించి, నివాళులర్పించారు.

కౌలు రైతుల సంతకాలు సేకరణ



తాడేపల్లిరూరల్: దుగ్గిరాల మండల పరిధిలోని పెరికలపూడి, పెదపాలెం, పెదకొండూరు, గొడవర్రు, చిలువూరు గ్రామాల్లో ఆంధ్రప్రదేశ్ కౌలు రైతుల సంఘం ఆధ్వర్యంలో కౌలు రైతులకు గుర్తింపు కార్డులు మంజూరు చేయాలని కోరుతూ సోమవారం కరపత్రాలు పంపిణీ చేస్తూ, రైతుల వద్ద నుండి సంతకాల సేకరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కౌలు రైతుల సంఘం జిల్లా అధ్యక్షుడు మన్నవ నాగమల్లేశ్వరరావు మాట్లాడుతూ కౌలు రైతులకు భూ యజమాని అంగీకారంతో సంబంధం లేకుండా గుర్తింపు కార్డులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. 2019లో అధికారంలో వచ్చిన వైఎస్సార్ సీపీ ప్రభుత్వం 2011 భూ ఆధీకృత కౌలు రైతు చట్టంలో మార్పు చేసి భూ యజమాని అనుమతి తప్పని సరి చేయడంతో అనేక మంది కౌలు రైతులు కౌలు కార్డులు రాక ఇబ్బందులు ఎదుర్కొన్నారని తెలిపారు. బ్యాంకుల ద్వారా రుణాలు మంజూరు చేసి, అన్నదాత సుఖీభవ కింద రూ.20 వేలు మంజూరు చేసి కౌలు రైతులకు ఆదుకోవాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకి వినతిపత్రం అందించేందుకు రైతుల సంతకాలు సేకరిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాజేంద్రబాబు, కె.శ్రీనివాసరావు, డి.విజయలక్ష్మి, చంద్రశేఖర్, ఎం.రామ్చరణ్, ఎం.అంజయ్య, కె.దావీదు, శ్రీరామారావు పాల్గొన్నారు.

బాబు గారూ.. భృతి ఇప్పించండి..!



కూటమి సూపర్-6 హామీల్లో మొట్టమొదటి ప్రాధాన్యతనిచ్చిన 20 లక్షల ఉద్యోగాలు, నిరుద్యోగ భృతి

- సీఎం చంద్రబాబుకు నిరుద్యోగ యువత వినతి
- నిరుద్యోగ భృతిపై నోరు విప్పని కూటమి ప్రభుత్వం
- నియోజకవర్గంలో 77 వేల కుటుంబాల ఎదురుచూపులు

ప్రత్తిపాడు: సూపర్ సిక్స్లో నిరుద్యోగ యువతకు నెలకు రూ.3 వేలు నిరుద్యోగ భృతి, యువతకు 20 లక్షల ఉద్యోగాలు, మెగా డీఎస్సీ, ప్రతి ఏటా జాబ్ క్యాలెండర్ వంటి అనేక హామీలను చంద్రబాబు నాయుడు అండ్ కో మేనిఫెస్టోలో చేర్చింది. కానీ గద్దెనెక్కిన తరువాత మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలపై చంద్రబాబు సర్కారు నోరు మెదపడం లేదు. ముఖ్యంగా నిరుద్యోగ భృతి వంటి పథకంపై ఎటువంటి ప్రకటనా చెయ్యలేదు. ప్రకటన ఎప్పుడు వస్తుందా అని నిరుద్యోగ యువత ఆశగా ఎదురు చూస్తుంది. బాబు సారూ భృతి ఎక్కడ అంటూ.. ప్రశ్నిస్తోంది. ప్రత్తిపాడు నియోజకవర్గంలోని ఐదు మండలాల్లో 2011 జనాభా లెక్కల ప్రకారం 77,227 కుటుంబాలుండగా, 2,87,040 మంది జనాభా ఉన్నారు.

మండలాల వారీగా కుటుంబాలు, జనాభా వివరాలిలా ఉన్నాయి.

మండలం	కుటుంబాలు	జనాభా
ప్రత్తిపాడు	13,448	49,390
పెదనందిపాడు	12,212	41,980
వట్టిచెరుకూరు	12,805	45,773
కాకుమాను	12,091	40,681
గుంటూరురూరల్	26,671	1,09,216
మొత్తం	77,227	2,87,040

'యువత సంక్షేమం' అంటూ..

రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కూటమి ఎన్నికల మేనిఫెస్టోలో యువత సంక్షేమం అంటూ అనేక పథకాలు ప్రకటించారు. వాటిలో కొన్ని.. మెగా డీఎస్సీ, ఏటా జాబ్ క్యాలెండర్, ఉత్తరాంధ్ర, కోస్తా, రాయలసీమ ప్రాంతాల అభివృద్ధి, ఉద్యోగాల కల్పనకు ప్రత్యేక ఎంప్లాయిమెంట్ జోన్ల ఏర్పాటు, ఉద్యోగాల కల్పనకు ఎంఎస్ఎంఈ సెక్టార్ను ప్రోత్సహించడం, నైపుణ్య శిక్షణా కేంద్రాలను పునఃప్రారంభించి విస్తరించడం, డిజిటల్ లైబ్రరీలు వంటి అనేక పథకాలను ప్రకటించినప్పటికీ వాటి ఊసే లేకపోవడంతో నిరుద్యోగులు ప్రభుత్వ ప్రకటన కోసం ఆశగా ఎదురు చూస్తున్నారు.

నిరుద్యోగ భృతిపై విధి విధానాలు ప్రకటించాలి



ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ ప్రకారం నిరుద్యోగ భృతిపై ప్రభుత్వం యుద్ధ ప్రాతిపదికన చర్యలు తీసుకోవాలి. నిరుద్యోగ యువతకు ఉద్యోగావకాశాలు కల్పించాలి. లేదా అర్హులైన నిరుద్యోగ యువతకు మేనిఫెస్టోలో ఇచ్చిన మాట ప్రకారం రూ.మూడు వేలు నిరుద్యోగ భృతిని తక్షణమే చెల్లించాలి. – దారం అశోక్ కుమార్, బొంతపాడు, గుంటూరు రూరల్ మండలం

నిరుద్యోగ భృతి సత్వరం చెల్లించాలి



నిరుద్యోగ యువతకు ఉద్యోగావకాశాలు కల్పించాలి. వీలుకాని పక్షంలో ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన మాట ప్రకారం రూ.మూడు వేలు నిరుద్యోగ భృతిని యువతకు అందించాలి. అవి వారి జీవనోపాధికి ఎంతో కొంత ఆర్థిక ఊతాన్ని అందిస్తాయి. ప్రభుత్వం సాధ్యమైనంత త్వరగా నిరుద్యోగ భృతిపై నిర్ణయం తీసుకోవాలి.

– గద్దం శంకర్, కోవెలమూడి, వట్టిచెరుకూరు మండలం

జాబ్ క్యాలెండర్పై స్పష్టత ఇవ్వాలి



జాబ్ క్యాలెండర్పై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలి. ఏ సంవత్సరం ఎన్ని ఉద్యోగాలు, ఎప్పుడు, ఏ నెలలో ఇస్తామన్న దానిపై యువతకు స్పష్టంగా తెలియజేయాలి. నిర్ణయం తీసుకోవడంలో జాప్యం జరిగే కొద్దీ అర్హత ఉన్న వారు నష్టపోయే ప్రమాదం ఉంది. ప్రభుత్వం త్వరిత గతిన స్పందించాలి. స్వగ్రామాల్లోనే ఉద్యోగావకాశాలు కల్పించేలా కృషి చేయాలి. లేదా నిరుద్యోగ భృతిని అందించాలి.

– జి. శ్రీకాంత్, నిరుద్యోగి, కాకుమాను.

వృద్ధాశ్రమానికి నిత్యావసర సరుకులు అందజేత



వృద్ధాశ్రమానికి నిత్యావసర సరుకులు అందజేస్తున్న చలపతి విద్యార్థులు

గుంటూరు రూరల్: విద్యార్థి దశ నుంచి సమాజ సేవపై ప్రతి విద్యార్థి అవగాహన కలిగి ఉండాలని చలపతి ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎమ్ చంద్రశేఖర్ అన్నారు. సోమవారం నగర శివారుల్లోని లాం నందున్న చలపతి ఇంజినీరింగ్ కళాశాల టెక్వింగ్స్ అసోసియేషన్ విద్యార్థులు నగరంలోని పట్టాభిపురం నందున్న నిషిద ఓల్డ్ఏజ్హోమ్ నందున్న వృద్ధులు, అనాథలకు మూడు నెలలకు సరిపడా నిత్యావసర సరుకులు, బియ్యం, కంది పప్పు, నూనె, గోధుమపిండి, కూరగాయలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ తమ కళాశాల విద్యార్థులు ప్రతి ఏటా నిర్వహించే సమాజ సేవా కార్యక్రమాల్లో భాగంగా ఇటువంటి సేవా కార్యక్రమాలను నిర్వహించటం సంతోషకరమన్నారు. ప్రతి విద్యార్థి తోటివారికి సహాయ సహకారాలు అందించేందుకు ఎల్లప్పుడూ ముందుకు రావాలని కోరారు. కార్యక్రమంలో కళాశాల సీఎస్ఈ విభాగాధిపతి డాక్టర్ ఎ బాలాజీ తదితరులు టెక్వింగ్స్ విద్యార్థులను అభినందించారు.

మధ్యాహ్న భోజనం పరిశీలన



మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న ఎంఈవో రమాదేవి

ప్రత్తిపాడు: పీఎం పోషణ్ అమలులో నిర్లక్ష్యం వహిస్తే సంబంధిత బాధ్యులపై చర్యలు తీసుకోవడం జరుగుతుందని మండల విద్యాశాఖాధికారి సీహెచ్.రమాదేవి అన్నారు. నియోజకవర్గ కేంద్రం ప్రత్తిపాడులోని రామానగర్ కాలనీ ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్న భోజనం (పీఎం పోషణ్) అమలు తీరును సోమవారం ఎంఈవో రమాదేవి పరిశీలించారు. మెనూ ప్రకారం భోజనం వడ్డించారా? లేదా? కోడి గుడ్డును అందించారా? వంటి విషయాలను పరిశీలించారు. భోజనం ఎలా ఉంటుందన్న వివరాలను విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు రుచికరంగా, నాణ్యమైన భోజనాన్ని అందించాలని ఏజెన్సీ నిర్వాహకులను ఆదేశించారు. ఎప్పటికప్పుడు నాణ్యతను పరిశీలించాలని హెచ్ఎం నజీర్కు సూచించారు. అనంతరం విద్యార్థులకు ఎల్ఈడీ టీవీల ద్వారా బోధిస్తున్న డిజిటల్ పాఠ్యాంశాలను విద్యార్థులతో కలిసి తరగతి గదిలో కూర్చుని విన్నారు. వెంట సీఆర్పీలు, ఉపాధ్యాయులు ఉన్నారు.

వివా విద్యార్థులకు 'ఐబీఎం స్కిల్స్ బిల్డ్ ప్రోగ్రామ్'



ఐబీఎం స్కిల్స్ బిల్డ్ ప్రోగ్రామ్లో ఎడ్యుటెక్ శిక్షణాధికారి అశ్విన్కుమార్, వివా ది స్కూల్ విద్యార్థులు

పెదకాకాని: భవిష్యత్ నైపుణ్యాల పెంపు, అధునాతన సాంకేతికతను విద్యార్థులకు అందించేందుకు గానూ డిజిటల్ లెర్నింగ్ ప్లాట్ఫారమ్ 'ఐబీఎమ్ స్కిల్స్ బిల్డ్ ప్రోగ్రామ్' ను వివా ది స్కూల్ నందు ప్రారంభించారు. మండలంలోని నంబూరు వివా ది స్కూల్లో సోమవారం ప్రఖ్యాత ఐబీఎం (ఇంటర్నేషనల్ బిజినెస్ మెషీన్స్ కార్పొరేషన్) భాగస్వామ్యంతో ఎడ్యునెట్ ఫౌండేషన్ నిర్వహించే 'ఐబీఎం స్కిల్స్ బిల్డ్ ప్రోగ్రామ్ స్టూడెంట్ ఓరియేషన్' కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎడ్యుటెక్ శిక్షణాధికారి అశ్విన్ కుమార్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లడుతూ ఐబీఎం స్కిల్స్ బిల్డ్ ప్రోగ్రామ్ విద్యార్థులలో ఆధునిక సాంకేతిక నైపుణ్యాలు పెంపొందించేందుకు మంచి వేదిక అని అన్నారు. ఈ ప్రోగ్రామ్ ద్వారా కమ్యూనికేషన్, ప్రోగ్రామింగ్, సమస్య పరిష్కారం, నాయకత్వ నైపుణ్యాలు పెంపొందించు కోవచ్చన్నారు. ఈ ప్రోగ్రామ్ నందు ప్లస్ 1, ప్లస్2 విద్యార్థులు క్లౌడ్ కంప్యూటింగ్, ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్, సైబర్ సెక్యూరిటీ వంటి సాంకేతిక అంశాలలోనూ, 5 నుంచి 12వ తరగతి విద్యార్థులకు కమ్యూనికేషన్ స్కిల్స్, ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ నందు వివా ది స్కూల్ ఒప్పందంలో భాగంగా సంవత్సర కాలం పాటు డిజిటల్ శిక్షణను అందిచనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ ఎలి కమాండర్ కె శ్రీనివాసరావు, ప్రిన్సిపాల్ సిహెచ్ సరళ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రేపటి నుంచి సీపీఐ విస్తృత స్థాయి సమావేశం

లక్ష్మీపురం: సీపీఐ గుంటూరు జిల్లా కార్యవర్గ సమావేశం ఈ నెల 17, 18వ తేదీల్లో ఉదయం 10 గంటలకు గుంటూరులోని మల్లయ్య లింగం భవన్లో జరుగుతుందని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి జంగాల అజయ్కుమార్ తెలిపారు. ఈ మేరకు మల్లయ్య లింగం భవన్లో సోమవారం విలేకరుల సమావేశం నిర్వహించి, వివరాలు వెల్లడించారు. ఈ సమావేశాలకు సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ, సహాయ కార్యదర్శి ముప్పాళ్ళ నాగేశ్వరరావు, జాతీయ కార్యవర్గ సభ్యురాలు అక్కినేని వనజ పాల్గొంటారని తెలిపారు. ఈ సమావేశంలో అంతర్జాతీయ, జాతీయ, రాష్ట్ర రాజకీయ పరిస్థితులను, సీపీఐ వైఖరిని వెల్లడిస్తారని చెప్పారు. సభ్యులందరూ సకాలంలో పాల్గొని, జయప్రదం చేయాలని కోరారు. సీపీఐ నగర కార్యదర్శి మాల్యాద్రి, జిల్లా కార్యవర్గ సభ్యులు హనుమంతరావు, అరుణ్కుమార్ పాల్గొన్నారు.

దొరికిన పర్సు పోలీస్స్టేషన్లో అందజేత

తాడేపల్లిరూరల్: ఎంటీఎంసీ పరిధిలోని కాజ గ్రామంలో నేషనల్ హైవే టోల్ గేట్ వద్ద తనకు దొరికిన పర్సును కాజ గ్రామ సర్వేయర్ స్టాలిన్ మంగళగిరి రూరల్ పోలీసులకు సోమవారం అందజేశారు. ఎస్ఐ సీహెచ్ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ స్టాలిన్ అందజేసిన పర్స్ విజయవాడ కేఎల్రావ్ నగర్కు చెందిన ఎస్కే సమద్గా గుర్తించామని తెలిపారు. అందులో పాన్, బ్యాంక్ ఏటీఎం, ఆధార్ కార్డులు ఉన్నాయని తెలిపారు. రూరల్ పోలీస్స్టేషన్కు వస్తే అందజేస్తామన్నారు.

సమ్మె కాలానికి జీతాలు చెల్లించాలని వినతి



సమస్యను కమిషనర్కు వివరిస్తున్న ముత్యాలరావు

నెహ్రూనగర్: గుంటూరు నగరపాలక సంస్థలో పనిచేస్తున్న మున్సిపల్ కార్మికులకు సమ్మె కాలం జీతం వెంటనే చెల్లించాలని, సంక్రాంతి పండగ కానుక వెయ్యి రూపాయిలు చెల్లించాలని ది గుంటూరు జిల్లా మున్సిపల్ ఎంప్లాయీస్ అండ్ వర్కర్స్ యూనియన్(సీఐటీయూ) జిల్లా ప్రధాన కార్యదర్శి బి.ముత్యాలరావు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో నగర కమిషనర్ కీర్తి చేకూరిని కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2023 డిసెంబర్ 26 నుంచి 2024 జనవరి 10వ తేదీ వరకు నిర్వహించిన సమ్మె సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం సమ్మెకాలం జీతం చెల్లింపునకు అంగీకరించి, జీఓ జారీ చేసిందని తెలిపారు. అయితే గుంటూరు నగరపాలక సంస్థ కార్మికులకు ఇంత వరకు సమ్మెకాలం జీతం, పండగ కానుక చెల్లించలేదని చెప్పారు.

అధికారులు ప్రజలకు జవాబుదారీగా ఉండాలి

నెహ్రూనగర్: ప్రభుత్వ అధికారులు ప్రజలకు జవాబుదారీగా ఉండాలని, నగర కమిషనర్ వ్యక్తిగత సెలవులో ఉన్నప్పుడు ఆయా విభాగాధిపతులు తమ విభాగ పనితీరు పర్యవేక్షణ చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించడం సరికాదని నగర కమిషనర్ కీర్తి చేకూరి నగరపాలక సంస్థ విభాగాధిపతులపై అసహనం వ్యక్తం చేశారు. సోమవారం నగరపాలక సంస్థ కౌన్సిల్ సమావేశ మందిరంలో నగరంలో జరుగుతున్న అభివృద్ధి పనులు, పారిశుద్ధ్యం, పట్టణ ప్రణాళిక విభాగం నుంచి ఇవ్వాల్సిన అనుమతులు, విభాగాల వారీగా పెండింగ్ ఫైల్స్పై కమిషనర్ అత్యవసర సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్రభుత్వం నుంచి జీతాలు తీసుకునే అధికారులు ప్రజలకు జవాబుదారీగా ఉండాలని, విధుల్లో నిర్లక్ష్యంగా ఉండడం సరికాదన్నారు. ప్రజా సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం, ప్రజారోగ్యానికి భంగం కలిగించేలా వ్యవహరించిన వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. గత వారం విభాగాధిపతుల నుంచి కింద స్థాయి అధికారుల వరకు రోజువారీ వర్క్ రిపోర్ట్ ఫొటోలతో సహా అందించాలని ఆదేశించారు. విభాగాల వారీగా ప్రజా సేవలు, సమస్యలకు సంబదించిన ఫైళ్ల పరిష్కార జాప్యంపై సమీక్షించి, పెండింగ్పై ఆగ్రహం వ్యక్తం చేశారు. దరఖాస్తుల పరిష్కారంపై విభాగాధిపతులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. గతంలో నగరపాలక సంస్థలో జరిగిన పలు అభివృద్ధి పనుల్లో నాణ్యతా లోపం జరిగిందని, రాష్ట్ర విజిలెన్స్ శాఖ నుంచి ఆయా పనులపై సమగ్ర నివేదిక అందించాలని లేఖ పంపారన్నారు. భవిష్యత్తులో ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా విభాగాధిపతులు పూర్తిస్థాయి బాధ్యత వహించాల్సి ఉందన్నారు. కేవలం కింది స్థాయి అధికారుల రిమార్క్లతో సిఫార్స్ చేయాల్సిన అవసరం లేదని, అనుమతుల కోసం తమకు సిఫార్స్ చేసే ముందే తప్పనిసరిగా సదరు ఫైల్స్కి సంబంధించి క్షేత్ర స్థాయిలో పరిశీలించాలని, పనులపై పూర్తిగా అవగాహన కలిగి ఉండాలన్నారు. ఈ సమావేశంలో అదనపు కమిషనర్ కె.రాజ్యలక్ష్మి, డిప్యూటీ కమిషనర్ సీహెచ్.శ్రీనివాస్, సిటీ ప్లానర్ ప్రదీప్ కుమార్, ఎస్ఈ శ్యామ్సుందర్, సీఎంఓహెచ్ డాక్టర్ ఆషా, ఎంహెచ్ఓ మధుసూదన్ పాల్గొన్నారు.

శివాలయం అసిస్టెంట్ పూజారి మృతి

తాడేపల్లిరూరల్ : మంగళగిరి కొత్త పేటలోని శ్రీ గంగ భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి వారి దేవస్థానంలో అసిస్టెంట్ పూజారిగా పనిచేస్తున్న బూర్గుల శంకర శాస్త్రి సోమవారం గుండె పోటుతో మృతి చెందారు. ఆయనకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. శివాలయంలో సుమారు 45 సంవత్సరాల నుంచి అసిస్టెంట్ పూజారిగా విధులు నిర్వహిస్తున్నారు. శంకర శాస్త్రి భౌతిక కాయాన్ని పలువురు సందర్శించి, పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

అధైర్య పడొద్దు.. అండగా ఉంటాం

- ప్రజలు కూటమి ప్రభుత్వానికి బుద్ధి చెప్పే రోజులు ఎంతో దూరంలో లేదు
- వైఎస్సార్ సీపీ పొన్నూరు సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ



నాయకులతో ఇష్టాగోష్టిలో అంబటి మురళీకృష్ణ

పొన్నూరు: ప్రస్తుతం రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను ఏవీ సక్రమంగా అమలు చేయడం లేదని, త్వరలో ప్రజల ఛీత్కారానికి గురయ్యే రోజులు రావడం ఖాయమని వైఎస్సార్ సీపీ పొన్నూరు సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ అన్నారు. సోమవారం పట్టణంలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో పార్టీ కార్యకర్తలతో ఆయన సమావేశమయ్యారు. పలువురు కార్యకర్తలు తమకు జరిగిన అన్యాయాన్ని ఆయన దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా మురళీకృష్ణ మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ కార్యకర్తలు అధైర్య పడొద్దని, పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని అన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలో ఉన్న ఐదేళ్ల కాలంలో రాజకీయాలకు అతీతంగా పాలన సాగించిందని అన్నారు. ఏ విషయంలోనూ ఎవరికీ ఇబ్బంది కలిగించకుండా సంక్షేమ పథకాలను అందించిందన్నారు. చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం వైఎస్సార్ సీపీ కార్యకర్తలే లక్ష్యంగా దాడులకు పాల్పడుతుందని విమర్శించారు. సంక్షేమంతో ప్రభుత్వం ప్రజలకు చేరువ కావాలని, దాడుల ద్వారా కాదని హితవు పలికారు. సమావేశంలో ఎంపీపీ భవనం పద్మలీల, నాయకులు ఆకుల వెంకటేశ్వరరావు, షేక్.నాజర్, మల్లెల రాజు, గోపిశెట్టి వాసు, మూర్తిరాజు, షేక్.సుభాని, దేవరకొండ గోపి తదితరులు పాల్గొన్నారు.

చిరు ధాన్యాలతో ఆరోగ్యకర సమాజం

- రైతులకు ఆదాయం, మానవాళికి ఆరోగ్యం
- ఆహార, ఆరోగ్య నిపుణుడు డాక్టర్ ఖాదర్ వలి



మాట్లాడుతున్న ఆరోగ్య నిపుణుడు డాక్టర్ ఖాదర్వలి

గుంటూరు రూరల్: చిరు ధాన్యాలను ప్రతి రోజు మనం తీసుకునే ఆహారంలో తీసుకోవటం వల్ల ఆరోగ్యాన్ని, ఆదాయాన్ని పొందవచ్చని ప్రముఖ ఆహార, ఆరోగ్య నిపుణుడు డాక్టర్ ఖాదర్వలి తెలిపారు. సోమవారం వట్టిచెరుకూరు మండలం పుల్లడిగుంట నందున్న రైతునేస్తం ఫౌండేషన్ ఆధ్వర్యంలో పుల్లడిగుంట నగరంలోని బృందావన్ గార్డెన్స్లోని శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన 'చిరుధాన్యాలతో జీవనసిరి' కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మనలో ప్రతి ఒక్కరూ ఏదో ఒక అనారోగ్య సమస్యతో బాధ పడుతున్నామంటే దానికి కారణం మనం వాడే బియ్యం, గోధుమలే కారణమని తెలిపారు. గడచిన వందేళ్లలో మారిన జీవన విధానం, ఆహార ఉత్పత్తి పద్ధతి, తీసుకునే ఆహారంలో చోటు చేసుకున్న మార్పులే ఈ విపత్తుకి కారణమని చెప్పారు. ప్రతి ఒక్కరూ తప్పకుండా చిరుధాన్యాలు ఆహారంగా తీసుకోవటం ద్వారా రైతులకు ఆదాయం, ప్రజలకు ఆరోగ్యం రెండూ లభిస్తాయన్నారు. కార్యక్రమంలో వేంకటేశ్వరస్వామి దేవస్థానం చైర్మన్ మస్తాన్వలి, రైతునేస్తం ఫౌండేషన్ చైర్మన్ యడ్లపల్లి వేంకటేశ్వరరావు, రైతులు, ప్రజలు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కార వేదికకు అధికారుల డుమ్మా



తహసీల్దార్ కార్యాలయంలో సమావేశానికి హాజరైన అధికారులు

ప్రత్తిపాడు: ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిర్వహిస్తున్న ప్రజా సమస్యల పరిష్కార వేదిక (మీకోసం) పట్ల అధికారులు నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తున్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన మీకోసం కార్యక్రమానికి పలు శాఖల అధికారులు డుమ్మా కొట్టేశారు. ఎంపీడీవో దుర్గాప్రసాద్, తహసీల్దార్ కార్యాలయం సూపరింటెండెంట్ ప్రశాంతితో పాటు ఈవోపీఆర్డీ, విద్య, వ్యవసాయ, ఉద్యాన, పశు సంవర్ధక, ఇరిగేషన్, పీఆర్, ఆర్డబ్ల్యూఎస్, సోషల్ వెల్ఫేర్, ఐసీడీఎస్, హౌసింగ్, సెర్ప్ శాఖల అధికారులు మాత్రమే హాజరయ్యారు. కాగా వైద్య ఆరోగ్యశాఖ, దేవదాయశాఖ, డ్రైనేజీ, కార్మికశాఖ, స్పెషల్ ఎన్ఫోర్స్మెంట్ బ్యూరో, ఉపాధిహామీ, రవాణాశాఖల అధికారులు గైర్హాజరయ్యారు. ప్రతి వారం ఇదే తంతు జరుగుతున్నా.. ఇదేమని ప్రశ్నించే నాథుడు కరువవ్వడంతో పాటు చర్యలు తీసుకునే వారు లేకపోవడంతో మీకోసం కార్యక్రమంపై నిర్లక్ష్యపు నీడలు కమ్ముకుంటున్నాయి.